నమస్తే తెలంగాణ
మెదక్
6 | హైదరాబాద్, సోమవారం 8 జనవరి 2024 | MEDAK

మల్లన్న బండ్ల ఊరేగింపును ప్రారంభించిన ఎమ్మెల్యే

కొల్చారం, జనవరి 7: మండలంలోని కోనాపూర్‌లో మల్లన్న జాతర ఘనంగా ప్రారంభమైంది. ఆదివారం మల్లన్నకు బండ్ల ఊరేగింపు కార్యక్రమాన్ని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ప్రారంభించారు. గౌడ సంఘం మండలాధ్యక్షుడు వెంకట్ గౌడ్, సర్పంచ్ రమేశ్, ఉప సర్పంచ్ సుకన్య మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు మోత్కు మల్లేశం, వెంకటేశం, బీఆర్ఎస్ మండల యువత అధ్యక్షుడు కోనాపూర్ సంతోషిరావు, నాయకులు రవితేజ రెడ్డి పాల్గొన్నారు.


కోనాపూర్‌లో మల్లన్నకు బండ్ల ఊరేగింపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

తెలంగాణ బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘ్ మెదక్ జిల్లా ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆదివారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాంచందర్, మనిరామ్ రాథోడ్, మెదక్ డివిజన్ అధ్యక్షుడు దేవీసింగ్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, నర్సాపూర్ అధ్యక్షుడు చెన్న నాయక్, సభ్యులు ఉన్నారు.

-నర్సాపూర్, జనవరి7

ఉరేసుకుని ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

- రంజోల్ సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలలో ఘటన
- విద్యార్థిని మృతిపై విచారణ చేయాలని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు డిమాండ్

జహీరాబాద్, జనవరి 7: సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని స్వప్న(17) కళాశాల ఉన్న డార్మెంటరీ గదిలో ఫ్యాన్‌కు ఊరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఉపాధ్యాయులు, విద్యార్థినులు, పోలీసుల కథనం ప్రకారం .. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం రంజోల్ గురుకుల పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సర విద్యార్థిని స్వప్న ఆదివారం మధ్యాహ్నం భోజనం చేసి చదువుకునేందుకు పుస్తకాల కోసం డార్మెటరీ గదికి వెళ్లింది. డార్మెటరీ గదికి వెళ్లిన విద్యార్థిని స్వప్న ఫ్యాన్‌కు చున్నీతో ఊరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన తోటి విద్యార్థినులు విషయాన్ని ఉపాధ్యాయులకు తెలిపారు. వెంటనే విద్యార్థిని జహీరాబాద్ సర్కారు దవాఖానకు తరలించారు. విద్యార్థిని పరిశీలించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతురాలు స్వప్న సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం తూంకుంట గ్రామానికి చెందిన బ్యాగరి రాజు, వనజ దంపతుల కుమార్తె. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విద్యార్థిని స్వప్న మృతిచెందిన విషయం తెలుసుకున్న జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు వెంటనే పాఠశాలకు చేరుకొని మృతిపై వివరాలు తెలుసుకునేందుకు పాఠశాల లోనికి వెళ్లేందుకు ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. దీంతో గేట్ ఎదుట విద్యార్థినుల తల్లిదండ్రులతో కలిసి ఆందోళనకు దిగారు. విద్యార్థిని మృతిపై విచారణ జరిపి, న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆత్మహత్యకు గల కారమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జహీరాబాద్ ఆర్డీవో వెంకారెడ్డి తెలిపారు. విద్యార్థిని కుటుంబాన్ని ఆదుకోవాలని, కుటుంబంలో ఒకరికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని ఆయన తెలిపారు.

జహీరాబాద్ మండలం రంజోల్ సాంఘిక సంక్షేమ బాలిక గురుకుల పాఠశాల గేటు ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థిని తల్లిదండ్రులు

వైభవంగా మల్లన్న లగ్గం

- పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి కొండా సురేఖ
- హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, చామకూర మల్లారెడ్డి

శివనామస్మరణతో మార్మోగిన కొమురవెల్లి శైవక్షేత్రం

రాజగోపురం వద్ద ఒగ్గు పూజారుల సందడి

సిద్దిపేట ప్రతినిధి/ చేర్యాల, జనవరి 7 (నమస్తే తెలంగాణ): మేళతాళాలు.. మంగళవాయిద్యాలు.. భక్తుల జయజయధ్వానాల మధ్య కొమురవెల్లి మల్లికార్జునస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. మల్లన్న స్వామి.. మమ్మేలు అంటూ భక్తులు చేసిన నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఆదివారం సిద్దిపేట జిల్లా కొమురవెల్లిలోని మల్లన్న క్షేత్రంలో ఉన్న తోట బావి కల్యాణ వేదిక వద్ద లగ్గం జరిగింది. కల్యాణాన్ని వీక్షించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. కల్యాణోత్సవంలో స్వామి వారి తరపున పడిగన్నగారి మల్లికార్జున్, పడిగన్నగారి మల్లయ్య దంపతులు, అమ్మవార్ల తరపున మహాదేవుని మనోహర్, మహాదేవుని సాంబయ్య దంపతులు కల్యాణ తంతును నిర్వహించారు.

కనుల పండువగా ఊరేగింపు

స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను అర్చకులు ఆలయం నుంచి పోలీసు బొమ్మ, రాతిగీరలు, ఆలయ పరిసరాల్లో ఊరేగింపు నిర్వహిస్తూ కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చారు. మధ్యప్రదేశ్ ఉజ్జయిని పీఠాధిపతి సిద్ధలింగరాజ దేశికేంద్ర శివాచార్యుల పర్యవేక్షణలో కల్యాణోత్సవం జరిగింది. నడిపుడి మఠం భావనయ్యస్వామి, భువనేశ్వరస్వామి, ఆనందయ్య, జ్ఞానేశ్వర్‌శాస్త్రి, చంద్రశేఖర్‌స్వామి, భద్రయ్యస్వామి పురోహితులుగా, వ్యాఖ్యాతలుగా డాక్టర్ మహంతయ్య, నందుల మఠం శశిభూషణ సిద్ధాంతి స్వామిజీలు వ్యవహరించారు. ఉదయం 5గంటలకు ఆలయవర్గాలు రెండు క్వింటాళ్ల అన్నం వండి రాసిగా తయారుచేసి దృష్టికుంభం కార్యక్రమాన్ని నిర్వహించారు.

కల్యాణం

స్వస్తిశ్రీ శోభకృత్ నామ సంవత్సరం మార్గశిర మాసం ఏకాదశి ఉదయం 10.45 గంటలకు నిర్వహించాల్సిన కల్యాణం ఆలస్యంగా జరిగింది. కొమురవెల్లి పుణ్యక్షేత్రంలోని ఇంద్రకీలాద్రి ఆలయ ప్రాంగణంలోని తోటబావి వద్ద నిర్మించిన కల్యాణ వేదిక వద్ద స్వామి వారి కల్యాణం నిర్వహించారు. మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం సందర్భంగా ప్రభుత్వం తరపున రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, చామకూర మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితో కలిసి సమర్పించారు.

ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబానికి ఆర్థిక సాయం

సికింద్లాపూర్‌లో ఆర్థికసాయం అందజేస్తున్న జడ్పీటీసీ మహేశ్‌గుప్తా

శివ్వంపేట, జనవరి 7: మండలంలోని సికింద్లాపూర్ గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్‌చారి కుటుంబానికి జడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా ఆదివారం రూ.10వేల ఆర్థిక సాయాన్ని సర్పంచ్ సుధాకర్‌రెడ్డితో కలిసి అందజేశారు. వారి వెంట ఉప సర్పంచ్ నర్సింలు, నరేందర్, నరేశ్‌కుమార్, వెంకటేశ్, మల్లేశ్, శ్రీనివాస్, యోగి తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

చిన్నశంకరంపేట, జనవరి 7 : మండలంలోని సూరారం గ్రామానికి చెందిన తొంట సావిత్రి పూరి గుడిసె అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. దీంతో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి ఆదివారం సర్పంచి నీరజ రూ.2వేలు, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశం 25 కిలోల బియ్యం అందజేశారు.

ఫుట్‌బాల్‌లో శరత్ చంద్రకు జాతీయ స్థాయి అవార్డు

హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో అవార్డు, ప్రశంసాపత్రం అందజేస్తున్న అసోషియేషన్ కార్యదర్శి ఫల్గుణ

రామాయంపేట, జనవరి 7: జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థి శరత్ చంద్రకు తెలంగాణ రాష్ట్ర ఫుట్‌బాల్ అసోషియేషన్ కార్యదర్శి ఫల్గుణ అవార్డు, ప్రశంసాపత్రం అందజేశారు. అనంతపురం జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో అండర్ 12లో రామాయంపేటకు చెందిన శరత్ చంద్రకు జాతీయ స్థాయి అవార్డును హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఆదివారం అందజేశారు. శరత్ చంద్ర ఈ అవార్డు అందుకోవడంపై యువ జ్యోతి క్లబ్ ఫుట్‌బాల్ అసోషియేషన్ నిర్వాహకుడు సత్యనారాయణ, పీడీ నాగరాజు అభినందించారు.

20 వరకు గురుకుల దరఖాస్తుల పొడిగింపు

మాట్లాడుతున్న గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ సరళాదేవి

రామాయంపేట, జనవరి 7 : తెలంగాణ ప్రభుత్వం గురుకుల విద్యాలయంలో దరఖాస్తులు చేసుకునే విద్యార్థుల కోసం గడువును ఈనెల 20 తేదీ వరకు పొడిగించిందని, నాల్గో తరగతి పాసైన విద్యార్థులు ఐదో తరగతికి ప్రవేశాలకు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా అందజేయాలని రామాయంపేట గురుకుల ప్రిన్సిపాల్ సరళాదేవి సూచించారు. ఆదివారం గురుకులలో విలేకరులతో ఆమె మాట్లాడారు.ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లో దరఖాస్తులు చేసుకునే వారు 20లోగా అందజేయాలని, అర్హులైన వారికి ఫిబ్రవరి 11న రాత పరీక్షలు ఉంటాయని తెలిపారు. మంచి మార్కులను పొందిన విద్యార్థులకే గురుకులంలో అర్హత, సీటు లభిస్తుందన్నారు.

చాముండేశ్వరీ ఆలయంలో ప్రత్యేక పూజలు

చిలిపిచెడ్: ఆలయంలో చాముండేశ్వరీ అమ్మవారిని దర్శించుకుటున్న భక్తులు

చిలిపిచెడ్, జనవరి 7 : మండలంలోని చిట్కుల్ గ్రామ శివారులోని వెలసిన చాముండేశ్వరీ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంజీరానదిలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారికి కుంకుమార్చనలు, ఒడిబియ్యం సమర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మల్లికార్జున స్వామి ఆలయంలో..

నర్సాపూర్, జనవరి 7 : మండల పరిధిలోని గొల్లపల్లిలో వెలసిన శ్రీ శివకేతకీ భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం ఆలయ దాత రాధామల్లేశం గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పాల్గొన్నారు.

నర్సాపూర్ : గొల్లపల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

వైభవంగా అయ్యప్ప పడిపూజ

అయ్యప్ప స్వామి మహా పడిపూజలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

నిజాంపేట, జనవరి 7 : మండల కేంద్రం నిజాంపేటలో గురుస్వామి ప్రదీప్‌రెడ్డి స్వగృహంలో ఆదివారం మహాపడిపూజ నిర్వహించారు. గురుస్వామి రెడ్డిశెట్టి రవీందర్ అధ్వర్యంలో నిర్వహించిన పడిపూజకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామికి ప్రత్యేక పూజలతో పాటు ఉత్సవ విగ్రహానికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు.

వేంకటేశ్వర ఆలయంలో ఆస్థాన సేవ

ఆలయంలో మంగళ హారతులతో మహిళా భక్తులు

రామాయంపేట, జనవరి 7 : పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా నేడు పూజారులు స్వామి వారికి ఆస్థాన సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం ఆలయంలోని వేంకటేశ్వర-పద్మావతి లను పూలతో అలంకరించి పూజా కార్యక్రమాలను చేపట్టారు. మహిళా భక్తులు ఆలయానికి చేరుకుని స్వామికి మంగళహారతులు సమర్పించి పల్లకీని ఊరేగించారు. ఉత్సవాలు 23వ రోజుకు చేరాయి.

10న మెగా జాబ్ మేళా

మెదక్ అర్బన్, జనవరి7: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెగా జాబ్ మేళాను ఈ నెల 10న నిర్వహించనున్నట్లు డీఐఈవోఎస్ అధికారి తెలిపారు. ఈ సంవత్సరం ఇంటర్మీడియట్ పూర్తి చేస్తున్న ఎంపీసీ/ఎంఈసీ విద్యార్థులు మొదటి సంవత్సరంలో 75 శాతం, మార్క్స్‌లో 60 శాతం ఉత్తీర్ణత సాధించిన వారిని ఎంపిక చేసుకోనున్నట్లు తెలిపారు. మెదక్‌లో నిర్వహించే జాబ్‌మేళాకు ఆండ్రాయిడ్ మొబైల్‌తో హాజరుకావాలని సూచించారు. వివరాలకు 8074065803, 9493553821 నంబర్లలో సంప్రదించాలన్నారు.

జీవన్‌జ్యోతి బీమా చెక్కు అందజేత

శివ్వంపేట, జనవరి 7: మండలంలోని మండల పరిధిలోని చండి, దొంతి, గంగాయపల్లి, చెన్నాపూర్ గ్రామాల్లో వికసిత భారత్ సంకల్ప యాత్రను బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అశోక్ సాదుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇటీవల మృతి చెందిన ఊదరి మంజులకు కుటుంబానికి ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమాయోజన కింద రూ. 2లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది రాములు, శ్యామల, సర్పంచ్ ఉమా అనిల్ ప్రసాద్, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు పిట్ల సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి యాదగిరి, భజరంగి అంజి, కుమార్‌గౌడ్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో 'వికసిత భారత్'

నిజాంపేట, జనవరి 7 : మండలంలోని నిజాంపేట,రజాక్‌పల్లి గ్రామాల్లో ఆదివారం వికసిత భారత్ సంకల్పయాత్రను అధికారులు నిర్వహించారు. కార్యక్రమంలో నిజాంపేట జడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్ నిజాంపేట, రజాక్‌పల్లి సర్పంచ్‌లు అనూష, సునీత, పంచాయతీ కార్యదర్శిలు నర్సింహులు, గీతాంజలి, ఇన్‌చార్జి నోడల్ అధికారి మురళీకృష్ణ, మండల కో-కన్వీనర్ చంద్రశేఖర్, పాఠశాల హెచ్.ఎం. ప్రభాకర్, వైద్య సిబ్బంది, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ఘనంగా నిర్వహిస్తాం

గజ్వేల్ అర్బన్, జనవరి7: గజ్వేల్‌లో 49వ రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీలను ఘనంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఒలింపిక్, కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ యాదవ్ అన్నారు. ఆదివారం గజ్వేల్ పట్టణంలో 11వ తేదీ నుంచి జరగబోయే 49వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు జరుగుతున్న ఏర్పాట్లను, సౌకర్యాలను జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. వెంట తెలంగాణ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు రవికుమార్, అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారులు మద్ది మహేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఏడుపాయల్లో భక్తుల రద్దీ

ఆలయం ఎదుట భక్తుల సందడి

పాపన్నపేట, జనవరి7: పవిత్ర పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గా భవానీమాత సన్నిధిలో ఆదివారం భారీగా భక్తుల సందడి నెలకొన్నది. పలు ప్రాంతాల నుంచి ఏడుపాయల చేరుకున్న భక్తులు మంజీరా నదిలోని వివిధ పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించి, దుర్గామాతను దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం, కుంకుమార్చనలు, తలనీలాలు, బోనాలు సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏడుపాయల చైర్మన్ సతెల్లి బాలాగౌడ్, ఆలయ ఈవో మోహన్ రెడ్డి, సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, రవివీర్‌కుమార్, లక్ష్మీనారాయణ, ప్రతాప్‌రెడ్డి, తోట నరసింహులు, వరుణాచారి, రాజు, శ్రీకాంత్, సంతోష్, యాదగిరి ఏర్పాట్లు చేశారు. వేద పండితులు శంకరశర్మ, పార్థివశర్మ, మురళీధర్ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. పాపన్నపేట ఎస్సై మహిపాల్‌రెడ్డి తగిన బందోబస్తు చర్యలు చేపట్టారు.

పూజలు అందుకుంటున్న వన దుర్గామాత

కొడుకు చేతిలో తండ్రి హతం

పాపన్నపేట, జనవరి 7: మద్యం మత్తులో దుర్భాషలాడిన తండ్రిపై కొడుకు బ్యాటుతో దాడి చేసి, హతమార్చిన ఘటన పాపన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. ఎస్సై మహిపాల్ రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని మిన్పూర్ గ్రామానికి చెందిన బత్తిని యాదగిరి (49)కి ఇద్దరు భార్యలు. మొదటి భార్య భూలక్ష్మికి ఒక కుమారుడు. ఆమె చాలాకాలం కిందట అతడిని విడిచిపెట్టి వెళ్లిపోయింది. దీంతో యాదగిరి రెండో పెండ్లి చేసుకున్నాడు. ఆమెకు ఇద్దరు కుమారులు. పెద్ద కొడుకు దుర్గాప్రసాద్, చిన్న కొడుకు సిద్దార్థ్. ముగ్గురు కుమారులు కలిసిమెలిసి ఉంటున్నారు. యాదగిరి నిత్యం మద్యం మత్తులో ఇంట్లో గొడవ చేస్తూ కుటుంబ సభ్యులను దుర్భాషలాడేవాడు. శనివారం రోజు లాగే తాగొచ్చి గొడవ చేయగా, తట్టుకోలేక మృతుడి రెండో భార్య కుమారుడు దుర్గాప్రసాద్ తండ్రిపై క్రికెట్ బ్యాట్‌తో దాడి చేశాడు. దీంతో తీవ్ర గాయాల పాలైన యాదగిరిని మెదక్ ఏరియా దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ, పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందాడు. బత్తిని శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యాదగిరి మృతదేహం

ఇంటింటికీ రాములోరి అక్షింతలు

చిన్నశంకరంపేట : అక్షింతలను ఇంటింటికి తీసుకెళ్తున్న మహిళలు

కొల్చారం, జనవరి 7: మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో అయోధ్య రామయ్య అక్షింతలను ఆదివారం భాజాభజంత్రీలతో ఊరేగించి, సర్పంచ్ గోదావరి, సొసైటీ చైర్మన్ మల్లేశంగౌడ్ ఆధ్వర్యంలో కర్ణ యూత్ సభ్యులు, బీజేపీ నాయకులు ఇంటింటికీ పంపిణీ చేశారు.

చిన్నశంకరంపేటలో..

చిన్నశంకరంపేట, జనవరి 7: అయోధ్య రాముడి అక్షింతలను చందంపేటలోని పెద్దమ్మ దేవాలయం నుంచి శోభాయాత్రగా సర్పంచ్ శ్రీలత, ఎంపీటీసీ శివకుమార్ ఆధ్వర్యంలో ఇంటింటికీ పంపిణీ చేశారు.

నర్సాపూర్‌లో..

నర్సాపూర్, జనవరి7: మండలంలోని బ్రాహ్మణపల్లిలో అయోధ్య రాములోరి అక్షింతలను ఇంటింటికీ తిరుగుతూ పంపిణీ చేశారు. భక్తిశ్రద్ధలతో అక్షింతలు స్వీకరించారు. ఆకుల శ్రీనివాస్, సుధీర్‌కుమార్‌గౌడ్, స్వామి, ప్రభాకర్, వినోద్ పాల్గొన్నారు.

చిలిపిచెడ్ :చిట్కుల్‌లో అయోధ్య రాముడి అక్షింతలను భక్తి భజనలతో ఇంటింటికీ పంపిణీ చేస్తున్న భక్తులు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9640400073/9160900024.
NT-319407-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.